# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 134 క్రిష్ణా, ఆదివారం 08 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-







## హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 07 :** అమరావతికో ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు.ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు 1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం'' అని ఉద్వేగంగా ప్రసంగించారు.తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను



అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు.అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## మూలపేట పోర్టు దగ్గర టౌన్‌షిప్‌లు,,,,3వేల ఎకరాల్లో ప్లాన్



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 07 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పోర్టుల్ని అభివృద్ధి చేస్తోంది.. కొత్త పోర్టుల్ని కూడా తెరపైకి తీసుకొచ్చింది. కేంద్రం సహకారంతో నిధులు తీసుకొచ్చి వీటిని ప్లాన్ చేస్తున్నారు. అయితే శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు నిర్మాణం పనులు వేగవంతం చేశారు.. అక్కడే ఇండస్ట్రియల్ క్లస్టర్ కూడా ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తున్నారు. తాజాగా టౌన్‌షిప్‌లు కూడా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు టౌన్‌షిప్‌ల కోసం అధికారులు భూముల్ని గుర్తిస్తున్నట్లు సమాచారం. టెక్కలి దగ్గర నేషనల్ హైవే నుంచి మూలపేట పోర్టు వరకు ఉన్న లింక్ రోడ్డుకు ఇరువైపులా ఈ టౌన్‌షిప్‌లు ప్లాన్ చేస్తున్నారట. భూసేకరణ దిశగా అడుగులు పడుతున్నాయట. మూలపేట పోర్టుకు కనెక్ట్ చేసే రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.. ఇప్పటికే 100 వెడల్పుతో భూసేకరణ పూర్తి చేసి.. ఈ రోడ్డు పనులు కూడా కొనసాగుతున్నాయి. అయితే పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు తీసుకొచ్చే పనిలో ఉన్నారు. అయితే ఈ పరిశ్రమల కోసం టౌన్‌షిప్‌లు నిర్మించాలని ప్లాన్ చేశారు. ఈ మూలపేట పోర్టు రోడ్డుకు రెండు వైపులా స్థలాలు సేకరించనున్నారు. ఆ రోడ్డుకు దగ్గర 50 మీటర్లు గ్రీనరీ ప్లాన్ చేశారు.. ఆ తర్వాత కిలోమీటరు వరకు భూముల్ని టౌన్‌షిప్‌ల కోసం కేటాయించనున్నారు. ఈ టౌన్‌షిప్‌ల కోసం ఏకంగా 3వేల ఎకరాలు సేకరించాలని భావిస్తున్నారు. ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. మూలపోర్టు సమీపంలో నౌపడాలో ప్రస్తుత ఆర్అండ్ఆర్ కాలనీ దగ్గర మరో టౌన్‌షిప్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ మర్రిపాడు రెవెన్యూ పరిధిలో ఉయ్యాలపేట రోడ్డులో జిరాయితీ ఉప్పు భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించాట. మొత్తం 485 ఎకరాల భూములు ఉన్నాయట.. వీటిని భూసమీకరణ ద్వారా తీసుకోవాలని భావిస్తున్నారట. అప్పుడు టౌన్‌షిప్‌కు ఇబ్బందులు ఉండవు అంటున్నారు.. ప్రభుత్వానికి భారం తగ్గుతుంది అంటున్నారు. అందుకే ఈ భూముల విషయంలో రైతుల్ని ఒప్పించాలని నిర్ణయించారట. జేసీ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవోలు కలిసి ఆ భూముల్ని రెండు రోజుల క్రితం పరిశీలించారు.

## తమిళ భాషా సంస్కృతులే ప్రపంచానికి భారత్ అందించిన అమూల్య కానుక: ప్రధాని మోదీ ప్రశంసలు

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 07** ప్రపంచ నాగరికతకు భారతదేశం అందించిన అత్యున్నతమైన మరియు పురాతనమైన వరం తమిళ భాష అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. మలేషియా పర్యటనలో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, తమిళ సాహిత్యం యొక్క గొప్పతనాన్ని ఆకాశానికెత్తారు. వేల ఏళ్ల చరిత్ర కలిగిన తమిళ సంస్కృతి కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదని, అది మానవాళి మొత్తానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదిగిందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.తమిళ ప్రజలు తమ అద్భుతమైన మేధస్సు మరియు ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష సేవలందిస్తున్నారని ప్రధాని మోదీ ప్రశంసించారు. శాస్త్ర సాంకేతిక రంగాల నుండి పరిపాలన వరకు తమిళులు చూపుతున్న చొరవ అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కేవలం భారత్‌లోనే కాకుండా, ప్రపంచంలోని అనేక దేశాల అభివృద్ధిలో తమిళ సోదర సోదరీమణులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని ఆయన భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. దేశ అత్యున్నత పదవుల్లో తమిళుల ప్రాతినిధ్యాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేశారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల నుండి నేటి కేంద్ర క్యాబినెట్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాయకుల వరకు, తమిళులకు సముచిత స్థానం దక్కడం సంతోషకరమని అన్నారు. పరిపాలనా దక్షతలో తమిళులు ఎప్పుడూ ముందుంటారని, వారి క్రమశిక్షణ మరియు పనితీరు భారత ప్రభుత్వానికి బలమైన శక్తిని ఇస్తున్నాయని



ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, వివిధ భాషలు మరియు సంస్కృతులు ఉన్నప్పటికీ మనమంతా ఒకటేనని మోదీ పునరుద్ఘాటించారు. తమిళ సంస్కృతి భారతీయతకు ఒక ఆభరణం లాంటిదని, దాన్ని కాపాడుకోవడం మరియు ప్రపంచానికి చాటి చెప్పడం మన బాధ్యతని వివరించారు. ఈ సదస్సు ద్వారా భారతీయ వారసత్వాన్ని విదేశాల్లో కూడా సగర్వంగా చాటుతున్న ప్రవాస భారతీయుల కృషిని ఆయన అభినందించారు.

## ఏపీలో భారీగా మున్సిపల్ కమిషనర్లు బదిలీ.. వారికి కొత్తగా పోస్టింగ్స్




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 07 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి భారీగా అధికారుల్ని బదిలీలు చేసింది. మొత్తం పదిమంది కార్పొరేషన్లు, మున్సిపాలిటీ కమిషనర్లు బదిలీపై వెళ్లారు. అలాగే పోస్టింగ్ వేచి ఉన్న కొంతమందికి అవకాశం కల్పించారు. ఈ బదిలీలకు సంబందించి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. విజయవాడ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె శివరాం ప్రసాద్ బదిలీపై వెళ్లారు. ఆయన్ను ప్రభుత్వం పల్నాడు జిల్లా వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. వినుకొండలో కమిషనర్‌గా ఉన్న ఎం.సుభాష్ చంద్రబోస్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు.. ఆయన్ను రాష్ట్ర పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అనంతపురం కార్పొరేషన్ కమిషనర్‌గా ఎం జస్వంతరావును నియమించారు.. ఆయన మొన్నటి వరకు పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు. అనంతపురంలో ప్రస్తుతం ఉన్నా కమిషనర్ బి.బాలస్వామిని బదిలీ చేశారు.. ఆయనకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శి జి.సాంబశివరావును బదిలీ చేశారు.. ఆయన్ను గుంటూరు కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పంపించారు. ప్రస్తుతం గుంటూరు డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న టి వెంకట కృష్ణయ్యను పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌ను కూడా బదిలీ చేశారు. ఆయన్ను కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుతం ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఎం.కృష్ణను సీఆర్‌డీఏకి బదిలీ చేశారు.. ఆయనకు సీఆర్‌డీఏ కమిషనర్ పోస్టింగ్ ఇస్తారని చెబుతున్నారు. ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శిగా పి.సింహాచలంను నియమించారు. సింహాచలం పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు.. ఇప్పుడు పోస్టింగ్ ఇచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శి ఆర్.దేవసేనను బదిలీ చేశారు.. బదిలీపై పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ అలీ ఖాన్‌ను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది.. కడప జిల్లా కమలాపురం నగర పంచాయతీ కమిషనర్‌గా నియమించింది ప్రభుత్వం. కమలాపురం కమిషనర్ బి.ప్రహ్లాద్‌కు ఏ పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన్ను రాష్ట్ర పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డేలేదు

### రాత్రి వేళ యథేచ్ఛగా తవ్వి తరలింపు

### లేఅవుట్లలో ఇళ్ల బేస్‌మెంట్లను ధ్వంసం చేసి మరీ మట్టి తవ్వకాలు

### – పట్టించుకోని అధికారులు



**క్రైం కౌంటర్ న్యూస్,** సబ్బవరం, ఫిబ్రవరి 7: మండలంలోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అక్రమార్కులు అర్థరాత్రి వేళ ఎక్స్‌కవేటర్లతో అక్రమ తవ్వకాలు మొదలు పెట్టి తెల్లవారే వరకు గ్రావెల్, మట్టిని లారీల్లో తరలించేస్తున్నారు. గత కొన్ని నెలలుగా అక్రమార్కులు చెలరేగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. మండలంలోని పైడివాడఅగ్రహారం గ్రామంలో ఎన్టీఆర్ కాలనీ(గతంలో జగనన్న కాలనీ)లో గత కొన్ని రోజులుగా కాలనీని ఆనుకొని అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. లేఅవుట్‌లో ఉన్న బేస్‌మెంట్లను సైతం ధ్వంసం చేసి గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. అసకపల్లి, రాయపుర అగ్రహారం, వంగలి తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. నంగినారపాడులో ఇళ్ల బేస్‌మెంట్ల మధ్యలో తవ్వకాలు జరిపి మట్టిని తరలించుకుపోతున్నారు. పైడివాడ, గంగవరం, నంగినారపాడు, గాలిభీమవరం గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కాగా లారీ గ్రావెల్ రూ.4 వేలు, డంపర్ గ్రావెల్ రూ.7 వేలు చొప్పున విక్రయిస్తున్నారని తెలిసింది. మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# పక్కాగా శివరాత్రి ఏర్పాట్లు



**క్రైం కౌంటర్ న్యూస్,** నర్సీపట్నం, ఫిబ్రవరి 7 మహాశివరాత్రికి బలిఘట్టం ఉత్తరవాహినికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. శనివారం బలిఘట్టం ఉత్తరవాహిని ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ తేదీ రాత్రంతా భక్తులు జాగారం ఉండి 16న తెల్లవారు జామున ఉత్తరవాహినిలో స్నానాలు చేయడానికి వస్తారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధికంగా వస్తారని, పుణ్య స్నానాలు చేసిన తర్వాత దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ అక్షయపాత్ర తరపున భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అగ్నిమాపక కేంద్రం పక్కన, బలిఘట్టం పాత పంచాయతీ పక్కన ఉన్న రోడ్లకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ సురేంద్రను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ, ఏఈలకు సూచించారు. ట్రాఫిక్, వాహనాలు పార్కింగ్ సమస్య లేకుండా చూడాలని సీఐ గఫూర్‌ను ఆదేశించారు. అగ్నిమాపక వాహనం, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. నదిలో ప్రస్తుతం ఉన్న నీరు విడిచి పెట్టి, శివరాత్రికి రెండు రోజుల ముందు రావణాపల్లి కొత్త నీటిని విడుదల చేస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ సాయత్రం ఉత్తరవాహిని వద్ద అన్నవరం దేవస్థానం వేద పండితుల ఆధ్వర్యంలో గంగాహారతి నిర్వహిస్తున్నామని తెలిపారు. 16వ తేదీన వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని బలిఘట్టం అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిని ఆదేశించారు. అవసరమైన సిబ్బందిని, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధికారులు సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, కమిషనర్ సురేంద్ర, తహశీల్దార్ రామారావు, సీఐ గఫూర్, ఏఎంసీ చైర్మన్ రమణ పాల్గొన్నారు.రూ.22 కోట్లతో రహదారుల అభివృద్ధినియోజవర్గంలో రూ.22 కోట్లతో 29 రహదారులను అభివృద్ధి చేస్తున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్ కల్యాణ్ చొరవతో రాష్ట్రంలో 1,392 రహదారులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నాబార్డ్, ఎస్ఏఎస్‌సీఐ నిధులతో పనులు చేపడతున్నామన్నారు. ఇందులో నర్సీపట్నం నియోజకవర్గం మీద ప్రత్యేక అభిమానంతో 29 రహదారుల అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. ఈ నిధులతో మాకవరపాలెంలో రూ.4.21 కోట్లతో 4 రోడ్లు, నాతవరం మండలంలో రూ.8.12 కోట్లతో 7, గొలుగొండ మండలంలో రూ.6.3 కోట్లతో 12, నర్సీపట్నం మండలంలో రూ.3.37 కోట్లతో 4 రోడ్లు అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. ఈ పనులకు టెండర్ల ప్రక్రియ 15 రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. రహదారుల నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఆయా మండల నాయకులు దగ్గరుండి చూసుకోవాలని సూచించారు.

# శ్రీశైలం వెళ్లే భక్తులకు.. రెండు రోజులు ముందుగానే అనుమతి

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 07 :** శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం నుంచి శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అయితే పాదయాత్రగా శ్రీశైలం వచ్చే భక్తులకు అటవీశాఖ అధికారులు శుభవార్త చెప్పారు. ఈ నెల 6 నుంచి 15 వరకు అటవీ మార్గంలో శ్రీశైలానికి పాదయాత్రగా వచ్చేందుకు అనుమతి ఇచ్చారు. వాస్తవానికి ఫిబ్రవరి 8 నుంచి 15 వరకు మాత్రమే అటవీ మార్గంలో అనుమతించాలని నిర్ణయించారు. కానీ ఇటీవల శ్రీశైలంలో బ్రహో?త్సవాల ఏర్పాట్లపై సమీక్ష చేసిన మంత్రులు.. భక్తుల ఇబ్బందుల్ని గమనించి ఈ నెల 6 నుంచి 15 వరకు అటవీ మార్గంలో భక్తుల్ని అనుమతించాలని నిర్ణయించారు. ఈ క్రమంంలో శుక్రవారం (ఫిబ్రవరి 6) నుంచి భక్తులు వెంకటాపురం నుంచి శ్రీశైలానికి అటవీ మార్గంలో బయలుదేరారు.. ఈ నిర్ణయంపై భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.వాస్తవానికి నాగార్జునసాగర్ టు శ్రీశైలం నల్లమల అభయారణ్యంలో పెద్దపులుల్ని లెక్కిస్తున్నారు. ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్స్- 2026లో భాగంగా పులుల్ని మూడు దశల్లో లెక్కిస్తున్న సంగతి తెలిసిందే. జనవరి 3 నుంచి మే 31 వరకు లెక్కింపు కొనసాగనుంది. ప్రస్తుతం తొలిదశ లెక్కింపులో భాగంగా ఈ నెల 10 వరకు పులుల్ని లెక్కింపు కొనసాగనుంది. ప్రస్తుతం ప్రకాశం జిల్లా మార్కాపురం, గిద్దలూరు.. నంద్యాల, ఆత్మకూరు పారెస్ట్ డివిజన్‌లో లెక్కిస్తున్నారు. ట్రాప్ కెమెరాల సాయంతో పులుల లెక్కలు వేస్తున్నారు. ఈ కారణంగానే అటవీ మార్గంలో శ్రీశైలం నడిచి వెళ్లే భక్తుల్ని అనుమతించలేదు.. ఆంక్షలు విధించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యే ఈ నెల 8 నుంచి బ్రహ్మోత్సవాలు ముగిసే 15 వరకు మాత్రమే అటవీమార్గంలో అనుమతించారు.

అయితే శ్రీశైలానికి వచ్చే భక్తులు, శివ దీక్ష తీసుకున్న భక్తులు ముందుగానే పాదయాత్రగా బయల్దేరారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. భక్తులు అటవీ మార్గంలో వెళ్లకుండా.. నంద్యాల జిల్లా



ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి కర్నూలు- గుంటూరు నేషనల్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి దోర్నాల మీదుగా శ్రీశైలం వెళ్లాలని చెప్పారు. అయితే అంత దూరం ప్రయాణం అంటే ఇబ్బందులు ఎదురవుతాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 2న శ్రీశైలంలో జరిగిన సమీక్షకు హాజరైన మంత్రులు అటవీశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. అనంతరం రెండు రోజులు ముందుగానే.. అంటే ఫిబ్రవరి 6 నుంచి 15 వరకు భక్తులు అటవీ మార్గంలో నడిచి వెళ్లేందుకు అనుమతించారు. మొత్తం మీద శ్రీశైలం అటవీమార్గంలో వెళ్లే భక్తులకు ఊరట లభించింది. ఇటు బ్రహ్మోత్సవాల కోసం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

శ్రీశైలానికి అటవీమార్గంలో కాలినడకన వెళ్లే భక్తులు అటవీశాఖ అధికారులు కొన్ని సూచనలు చేశారు. ప్రతి భక్తుడి బ్యాగుల్ని తనిఖీ చేస్తారు.. సిగరెట్లు, బీడీలు, అగ్గిపెట్టె, గుట్కాలను అనుమతించరు. అటవీ మార్గంలో వెళ్లే భక్తులు వన్యప్రాణులకు ఎలాంటి హాని చేయకూడదు. అలాగే ప్లాస్టిక్‌ను తీసుకెళ్లడం, అడవికి నిప్పు పెట్టే అగ్నిపెట్టెలు, మద్యానికి అనుమతి లేదు. రాత్రి వేళలో నడిచి వెళ్లే సమయంలో శబ్దం చేయకూడదు.

# ఏప్రిల్ 14వ తేదీ మరో రెండు క్వాంటం సెంటర్లు ఏర్పాటు.. చంద్రబాబు



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 07 :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా క్వాంటం వ్యాలీ నిర్మాణానికి పునాదిరాయి పడింది. అమరావతి క్వాంటం వ్యాలీ భవనం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో అమరావతి 'క్వాంటమ్ వ్యాలీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. మరోవైపు అమరావతి క్వాంటం వ్యాలీ కోసం ఏపీ ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. అమరావతి క్వాంటం వ్యాలీలో టీసీఎస్, ఐబీఎం, ఎల్‌అండ్‌టీ వంటి సంస్థలు కీలకంగా ఉన్నాయి. భారతదేశపు తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతి క్వాంటం వ్యాలీలో ఏర్పాటు చేయడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయి. అమరావతి క్వాంటం వ్యాలీ.. క్వాంటం కమ్యూనికేషన్స్, క్వాంటం కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగాలలో పరిశోధనలు, ఆవిష్కరణలకు వేదిక కానుంది. క్వాంటం టెక్నాలజీ రంగంలో అమరావతిని హబ్‌గా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు చేపట్టింది. అమరావతి క్వాంటం వ్యాలీ భవనం నిర్మాణాన్ని ఆగస్టు నాటికి పూర్తి చేసి, డిసెంబరు నాటికి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

మరోవైపు అమరావతి క్వాంటం వ్యాలీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ దేశానికే గేమ్ ఛేంజర్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు హైటెక్ సిటీ గేమ్ ఛేంజర్‌గా మారితే.. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ దేశానికే గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. రాబోయే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమరావతి క్వాంటం వ్యాలీని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మరోవైపు 2026 చివరికల్లా అమరావతి క్వాంటం వ్యాలీలో మొదటి క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయనున్నట్లు చంద్రబాబు వివరించారు. ఏప్రిల్ 14వ తేదీ అమరావతి క్వాంటం వ్యాలీలో మరో రెండు క్వాంటం సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 2030లోగా రెండున్నర లక్షల మంది క్వాంటం నిపుణుల అవసరం ఉంటుందని చంద్రబాబు నాయుడు చెప్పారు. ఈ క్రమంలో క్వాంటం వ్యాలీ కీలకంగా మారుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, అమరావతి క్వాంటం వ్యాలీ గేమ్ ఛేంజర్లుగా చంద్రబాబు అభివర్ణించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన జరిగిన ఈ రోజు చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి ప్రణాళిక జిల్లాలో 4,678కి ఇళ్ల స్థలాలు సిద్ధం

## మే నెలాఖరు నాటికి రోడ్లన్నీ పూర్తి కావాలి
## యూరియా, నకిలీ విత్తనదారులపై పీడీ యాక్టు
## డీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 07 :** ప్రజా సమస్యల పరిష్కారంలో పొరపాట్లకు తావివ్వ కుండా... ప్రజా ప్రతి నిధులతో అధి కారులు సమన్వయం చేసుకుని జిల్లా సమ గ్రాభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో శనివారం జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్సీ) జరిగింది. మంత్రి కొలుసు పార్థ సార?థితో కలిసి నాదెండ్ల సమీక్షించారు.

ఏలూరు, ఫిబ్రవరి 7 డీఆర్సీ సమావేశం ప్రారంభ కాగానే తొలుత గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల నివేదికపై సమీక్షించిన ప్రజాప్రతినిధులు, అధి కారులు ఆపై అజెండాపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధా నంగా పోలవరం పునరావాసం, కాలనీల అభివృద్ధి ఎజెం డాలో పెట్టి సమీక్షించారు. పాపికొండల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అటవీ, జలవనరుల శాఖ ద్వారా ప్రతిపాదనలు చేయాలని తీర్మానించారు. యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేసేవారిపై, నకిలీ విత్తనాలతో మోసం చేసే దళారులు, వ్యాపారులపై పీడీ యాక్టును అమలు చేయాలని, క్రిమినల్ కేసులు పెట్టాలని ఎస్పీ కిశోర్, జేసీ అభిషేక్ గౌడలకు మంత్రి నాదెండ్ల ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో భాగంగా ప్రతి పథకంపై ప్రత్యేక దృష్టి కేం ద్రీకరిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు త్వరలో 200 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేస్తామన్నారు.

మంత్రి నాదెండ్ల ఏమన్నారంటే...

'22ఏ నిషేధిత భూములపై 213 అర్జీలు రాగా ఇందులో 20 సమస్యలపై 1,199 మందికి చెందిన 142.04 భూము లపై నిషేధం ఎత్తివేశాం. 31.90 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధం చేశాం ఇప్పటి వరకు 97,144 మంది పేదలకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశాం. మరో 4,678 సిద్ధం చేశాం. ఉద్యాన, వాణిజ్యపంటల ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతేడాదిలో ఉద్యాన పంటలతో 7,693 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది 9,006 కోట్ల లక్ష్యంగా పెట్టుకున్నాం. పోలవరం పునారావాసంలో భాగంగా 14 గ్రామాలకు 13 గ్రామాలకు సర్వే పూర్తి చేశాం. మిగిలిన గ్రామంలో నిర్వా సితులకు ప్రత్యేక గ్రామసభ ద్వారా నష్టపరిహారం చెల్లింపు ల్లో న్యాయం చేస్తాం. పోలవరం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి, రిసార్ట్సు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తాం. మూడు ప్రధాన రహదారులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. రూ.120 కోట్లతో చేపట్టిన పనులన్నీ మే నెలాఖరు నాటికి పూర్తికి డెడ్‌లైన్ విధించా'మన్నారు.

అధికారులపై గరం..గరం..

యూరియా పంపిణీ, మొక్కజొన్న నకిలీ విత్తనాలపై మంత్రి నాదెండ్ల ఆరా తీసిన సమయంలో కేసుల నమోదు తక్కువ కావడంపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'జేడీ హబీబ్ బాషా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. మొక్కజొన్న రైతులతో అగ్రిమెంట్లు చాలాచోట్ల జరగడం లేదు.. కీలకంగా పంట వచ్చే దశ అయినందున.. నకిలీ విత్తన కంపెనీలపై సరైన చర్యలు తీసుకునే సమయం ఇదే' అంటూ తెలిపారు. విత్తనం తీసుకునే సమయంలో ఆయా కంపెనీలపై చర్యలకు ఉపక్రమించాలని మంత్రి నాదెండ్ల ఆదేశించారు. ఆర్‌అండ్ రోడ్లు మరమ్మతులు, నూజివీడులో రెండు డ్రెయిన్ల నిర్మాణం పనులు సాగకపోవడంపై మంత్రులు నాదెండ్ల, కొలుసు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ విజయరత్నంను ప్రశ్నించారు. రోడ్ల కాంట్రాక్టర్‌కు రూ.30 కోట్ల బకాయిలపై కలెక్టర్ స్పందిస్తూ.. ఇటీవల బిల్లులు చెల్లించిన కాంట్రా క్టర్లతో మాట్లాడించి పనులు పూర్తి చేయించాలన్నారు. 22ఏ నిషేధిత భూముల సమస్యలపై యంత్రాంగం తీసుకున్న చర్యలపై డీఆర్వో విశ్వేశ్వరరావు వివరించారు. ద్వారకాతిరుమల రాయలం చెరువులో మట్టి తవ్వకాలపై చర్చ సాగగా, మట్టిని పేదలు, రైతుల అవసరాలకు క్యూబిక్ మీటరు ఒక రూపాయికి ఇచ్చే అంశంపై వివరించాలని మంత్రి కొలుసు సూచించారు. ఉద్యాన పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆటో మ్యుటేషన్ల సబ్సిడీలపై మైక్రో ఇరిగేషన్ పీడీ రామ్మోహన్ వివరించగా, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మొత్తం గ్రౌండింగ్ కావాలని నాదెండ్ల సూచించారు. సమావేశంలో ఎంపీ పుట్టా మహేశ్ , జడ్పీ చైర్మన్ పద్మశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీ కృష్ణ, జేసీ అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ విన్నూత, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయడు పాల్గొన్నారు.ప్రొట్‌కాల్‌పై చర్చ ...రగడ

డీఆర్సీ సమావేశం మందిరంలో వేదికపై ఎమ్మెల్యేలకు సీటు వేయకపోవడంపై ఎమ్మెల్యే చింతమనేని డీఆర్వో విశ్వేశ్వరరావును ప్రశ్నించడం చర్చకు దారితీసింది. వేదికపై డీఆర్సీ చైర్మన్‌గా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల, మరో మంత్రి కొలుసు పార్థసార?థి, డీఆర్సీ వైస్ చైర్మ న్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ నేమ్‌బోర్డులను సీట్ల ముందు పెట్టారు. దీనిపై మంత్రి నాదెండ్ల, కలెక్టర్ చర్చించుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వేదికపై కూర్చు నేలా ఏర్పాట్లు చేశారు. తనకు ప్రొటోకాల్ పాటించ డం లేదని, ఏలూరు ఆర్డీవో అంబరీష్ ఫోన్ చేసినా ఎత్తడం లేదని, ఇదేమి నిర్లక్ష్యమంటూ ఎమ్మెల్సీ జయ మంగళ వెంకట రమణ ధ్వజమెత్తారు. ఏలూరు జిల్లాలో కలిసిన నూజివీడు, కైకలూరుకు ఇదే పరిస్థితి ఉందని మంత్రి కొలుసు వ్యాఖ్యానించారు. అధికారు లందరూ విధిగా ప్రజాప్రతినిధులకు ప్రోట్‌కాల్ విష యంలో జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి నాదెండ్ల సూచించారు.

సెప్టెంబరులోగా టిడ్కో ఇళ్లు పూర్తి

ప్రభుత్వ ఆదేశాల మేరకు టిడ్కో ఇళ్లను సెప్టెంబరు నాటికి పూర్తి చేస్తాం. ఎస్సీ,ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు విద్యుత్ కనెక్షన్ల ఏర్పాట్లు పూర్తి చేస్తాం. ఇళ్లను సగంలో వదిలేసిన రాక్‌క్రీట్




నిర్మాణ సంస్థపై క్రిమినల్ కేసును పెట్టిస్తాం. యూరియా నిల్వలను సొసైటీల నోటీసు బోర్డులో ప్రదర్శించాలి.

-- మంత్రి కొలుసు పార్థసారథి

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మాదేపల్లిలో టిడ్కో ఇళ్లకు సేకరించిన భూమిలో ఇళ్ల నిర్మాణం జరగలేదు. ఈ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుకు అవకాశం కల్పించాలి. నియోజకవర్గంలో 22ఏ భూ సమస్యకు సంబధించిన దేవదాయశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి.

-- ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

కొల్లేరులో రోడ్ల పనులు అడ్డుకోవడం తగదు

కొల్లేరులో రోడ్ల మరమ్మతులకు నిధులొచ్చి సంవత్సర మైనా పనులు చేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డు కోవడం తగదు. ఏలూరు--పంగిడిగూడెం, ఏలూరు--పెరి కీడు రోడ్లు నిర్మాణ పనులు పూర్తి చేయాలి.

-- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

పెదనింద్రకొలనులోని పేదల కాలనీలో 20 అడుగులు రోడ్డును 10 అడుగులు రోడ్డుకు తగ్గించారని కాలనీలో కొంతమంది లబ్ధిదారులు ఇళ్ల స్థలాలు తీసుకోలేదు. వారి స్థానంలో అర్హులకు మంజూరు చేయాలి. సీఎం ఇచ్చిన హామీ మేరకు నల్లజర్ల--లక్ష్మీపురం రోడ్డు పనులు చేప ట్టాలి. బువ్వనపల్లి-- నిడమర్రు, వరదాపురం-- దువ్వరోడ్డు మమ్మతులు చేయించాలి.

-- ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

వైద్యులను నియమించాలి

జంగారెడ్డిగూడెంలో ఏరియా ఆసుపత్రిలో వైద్య కొరతను పరిష్కరించాలి. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయాలి. రాయ లం చెరువులో అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి.

-- ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

గ్రామ కంఠం భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కైకలూరు నియోజవర్గ ఇళ్ల కాలనీలను మెరక చేయా లి. కొల్లేరు ఐదో కాంటూరు లోపు రోడ్లను అభివృద్ధి చేయాలి.

# క్వాంటమ్ గేమ్ చేంజర్ తొలి కంప్యూటింగ్ వ్యవస్థ అమరావతిలో

**డిసెంబరు నాటికి తొలి 'కంప్యూటర్' చేతికి**
**దీంతో 35-40 ఏళ్లపాటు యువత భవిత బంగారమే**
**కేవలం క్వాంటమ్‌కు మాత్రమే కాదు, లక్షల్లో నిపుణుల తయారీకీ నాంది పలుకుతున్నా**
**క్వాంటమ్‌లో నోబెల్ తెస్తే 100 కోట్ల నజరానా: సీఎం**
**అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనాలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి శంకుస్థాపన**
**15 ప్రముఖ సంస్థలతో ఎంవోయూలు**
**త్వరలోనే క్వాంటమ్‌లో ఎంటెక్ కోర్సులు**
**రూ.6వేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్: జితేంద్ర సింగ్**




క్రైం కౌంటర్ న్యూస్,అమరావతి, గుంటూరు, ఫిబ్రవరి 7 : మరో 35, 40 ఏళ్ల పాటు యువత భవితను తీర్చిదిద్దేలా సాంకేతిక రంగం వైపు అడుగులు వేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. చరిత్రను సృష్టించాలన్నా, తిరగ రాయాలన్నా అది విద్యార్థులకే సాధ్యమని వ్యాఖ్యానించారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనాలకు కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తో కలిసి శనివారం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాంటమ్ కంప్యూటింగ్ మొత్తం దేశానికే గేమ్ చేంజర్ కానుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యార్థి కృత్రిమ మేధ (ఏఐ) , క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నైపుణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16వ తేదీన బిల్ గేట్స్ ఏపీకి వస్తున్నారని తెలిపారు. 'ఇక్కడ ఈరోజు 'క్వాంటమ్ వ్యాలీ భవనాలకు మాత్రమే నేను పునాది వేయడం లేదు. గ్లోబల్ క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవంలో భాగస్వామ్యమయ్యే నిపుణుల తయారీకి కూడా నాంది పలుకుతున్నాను. ఐక్య రాజ్యసమితి ఈ ఏడాదిని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక సామర్థ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగానికి మంచి భవిష్యత్తు ఉంది." అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..నిన్న ఐటీ.. నేడు ఏఐ, క్వాంటమ్‌లదే భవిష్యత్తు

"గతంలో వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందుకోలేకపోయాం. ఐటీ రంగాన్ని మాత్రం దక్కించుకున్నాం. ఇప్పుడు ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లను సాధించుకోగలుగుతున్నాం. సాంకేతిక విప్లవాన్ని ఆదరించే ప్రధాని నరేంద్రమోదీ ఉండటం ఈ క్రమాన్ని వేగవంతం చేస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకున్న దేశానిదే భవిష్యత్తు. క్వాంటమ్ ఆకృతులు, ఉత్పత్తులు, ఇంటిలెక్చుయల్ ప్రాపర్టీసకు అమరావతి కేంద్రం కానుంది. డిఫెన్స్, హెల్త్‌కేర్, ఎనర్జీ, ఫైనాన్స్, క్లైమెట్ మోనెటరింగ్‌కు అమరావతి గమ్యస్థానం కానుంది. ఇప్పటిదాకా అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడేవారు. భవిష్యత్తులో అందరూ అమరావతి క్యాంటమ్ వ్యాలీ గురించే మాట్లాడతారు. ఈ రంగంలో ప్రపంచ శ్రేణి టెక్నాలజీ నగరంగా అమరావతి మారనుంది. భారత్‌లోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ కేంద్రాన్ని ఇక్కడ ఐబీఎంటీసీఎస్, ఎల్ అండ్ టీ ఏర్పాటుచేస్తున్నాయి."

2030 నాటికి 2.50 లక్షల మంది నిపుణులే లక్ష్యం

"ప్రధాని మోదీ ఆధునిక సాంకేతికతను బాగా అర్థం చేసుకున్నారు. సరైన సమయంలో సరైన వ్యక్తి సరైన చోట ప్రధానిగా ఉన్నారు. కేంద్రం ప్రారంభించిన క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవాన్ని రాష్ట్రం అందిపుచ్చుకుంది. తక్కువ సమయంలోనే వీటి ఏర్పాటుకు ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ ఏడాది డిసెంబరు నుంచి రాష్ట్రంలో తొలి క్వాంటమ్ కంప్యూటర్ పనిచేయడం ప్రారంభిస్తుంది. వీటిని 65 శాతం మేర దేశంలోనే తయారుచేస్తాం. ఈ రంగంలో నోబెల్ బహుమతి సాధించేవారికి రూ.100 కోట్లను పురస్కారంగా అందిస్తాం. 2030 నాటికి రెండున్నర లక్షల నిపుణులు ఇక్కడ పనిచేయడానికి అవసరం. ఇందులోభాగంగా వైజర్ సంస్థ ఇచ్చిన శిక్షణను యాభైవేలమంది ఇంజనీరింగ్ విద్యార్థులు పొందారు. దశల వారీగా 35 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడాన్ని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. దీనిపై ఐఐటీ మద్రాసు అడ్వాన్స్‌డ్ కోర్సుల కోసం దేశవ్యాప్తంగా 2.06 లక్షల మంది తమ పేరు నమోదు చేయించుకున్నారు. ఇక ప్రపంచవ్యాపంగా ఈ రంగంలో 50 లక్షల మంది శిక్షణ పొందుతుంటే, అందులో పది లక్షల మంది ఆంధ్రా యువకులే ఉన్నారు. ఐఎస్సీ తరహాలోనే ఏఐ లివింగ్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఏఐ, క్వాంటమ్ అవసరాల కోసం అమరావతిలో వర్సిటీని ఏర్పాటుచేస్తున్నాం. ప్రస్తుతం మేధా టవర్స్‌లో వీటిని తాత్కాలికంగా ప్రారంభిస్తున్నాం. త్వరలోనే శాశ్వత భవనాలను నిర్మిస్తాం. రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ వర్సిటీతో పాటు స్పేస్ టెక్నాలజీ వర్సిటీని కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఔషధాల ఆవిష్కరణ, వ్యక్తిగత ఆరోగ్యం, వాతావరణ అంచనాలు, క్రాప్ ప్లానింగ్, వాటర్ మేనేజ్‌మెంట్, పంటల ఉత్పత్తులు తదితర అంశాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను వినియోగిస్తాం. అమరావతి డీప్ టెక్నాలజీ ప్రయాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# వాడేది బీఎండబ్ల్యూ కారు.. చేసేవి చోరీలు!

**విశాఖ, కాకినాడ, రాజమండ్రిల్లో 62 దొంగతనాలు**
**రూ.కోటి విలువైన చోరీ సొత్తు స్వాధీనం**
**విశాఖలో ఇల్లాలు, హైదరాబాద్‌లో ప్రియురాలు.. దొరికింది విశాఖలో..**




క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 7 విశాఖలో ఇల్లాలిని, హైదరాబాద్‌లో ప్రియురాలిని పెట్టకుని, బీఎండబ్ల్యూ కారులో జల్సాగా తిరుగుతూ రూ.కోటి విలువైన బంగారం, వెండి, డబ్బు కూడబెట్టుకున్న ఘరానా దొంగను విశాఖ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అరెస్టు చేసేవరకూ అతడి దొంగతనాల గురించి ఇంట్లోగాని, బయట వాళ్లకు గాని తెలియకపోవడం చిత్రం. వివరాలను శనివారం సీపీ శంఖబ్రతబాగ్చి వెల్లడించారు. కాకినాడకు చెందిన మహ్ట?షరెడ్డి చిన్నతనం నుంచే జల్సాలకు అలవాటుపడి.. 15 ఏళ్ల వయస్సులోనే దొంగతనాల బాటపట్టాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 4 చోట్ల దొంగతనాలు చేసి పోలీసులకు పట్టుబడడంతో జువెనైల్ హోమ్‌కు పంపించా రు. అక్కడి నుంచి బయటకు వచ్చిన తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. హైదరాబాద్ వెళ్లి కొన్ని ఐటీ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. తర్వాత విశాఖ వచ్చి పలు ఐటీ కంపెనీల్లో పనిచేశాడు. ఇక్కడే కంపెనీలోని యువతితో ప్రేమాయణం సాగించాడు. హైదరాబాద్‌లోని ఒక సంస్థలో మంచి ఆఫర్ వచ్చిందంటూ 6 నెలల కిందట విశాఖలో ఉద్యోగం మానేసి హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ మరో యువతితో ప్రేమాయణం మొదలుపెట్టాడు. ఆమెతో ప్రేమాయణం సాగిస్తూనే అప్పుడప్పుడు విశాఖ వచ్చి.. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ చేసేవాడు. రెక్కీ సమయంలో కూడా తన ఆనవాళ్లేవి కనిపించకుండా మాస్క్, టోపీ ధరించేవాడు. రెక్కీ చేసిన ఇంట్లో రాత్రివేళ చోరీ చేసి, తర్వాత రోజు హైదరాబాద్ వెళ్లిపోయేవాడు.చోరీల గురించి భార్యకే తెలియదు!

మహ్ట?షరెడ్డి విశాఖలో తనకు పరిచయమైన యువతిని రెండు నెలల కిందట పెళ్లి చేసుకున్నాడు. మరోవైపు హైదరాబాద్‌లో యువతితో సంబంధం కొనసాగించాడు. చోరీచేసిన బంగారం, వెండిని భార్య, ప్రియురాలికి ఇస్తూ విలాస జీవితం గడిపేవాడు. చోరీసొత్తు విక్రయించి ఖరీదైన బీఎండబ్ల్యూ కారు కొన్నాడు. మహ్ట?షరెడ్డి నేరచరిత్ర గురించి పోలీసులు అరెస్టు చేసేంతవరకూ అతడి భార్యకు, ప్రియురాలికి తెలియదు. మహ్ట?షరెడ్డి తన భార్య, ప్రియురాలి వద్ద భారీ వేతనం సంపాదించే ఉద్యోగిగా బిల్డప్ ఇస్తూ చోరీ చేసిన సొమ్ముతో వ్యాపార రంగంలోకి ప్రవేశించాలని పథకం రచించాడు. అతను స్వతహాగా బాడీబిల్డర్. జిమ్ చేసేవాళ్లు కండరాలను పెంచేందుకు వాడే ప్రొటీన్ పౌడర్ తయా రీ యూనిట్‌ను విశాఖలో పెట్టాలనుకున్నాడు. అందుకు చోరీలు కూడా పెంచాడు. గత ఏడాదిన్నర కాలంలో గాజువాక, ఆరిలోవ, మల్కాపురం, పెందుర్తి, దువ్వాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో 26, కాకినాడ, రాజమండ్రి, సర్పవరం, రామచంద్రపురంలో 36 చోరీలు చేశాడు.

ఎలా దొరికాడంటే..!

గాజువాకలోని జోగవానిపాలేనికి చెందిన కన్నా శివరామకృష్ణ గత ఏడాది అక్టోబరు 10న అరుణాచలం వెళ్లారు. ఇంటి యజమాని 13న ఫోన్ చేసి ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉన్నాయని చెప్పడంతో ఆయన 14న నగరానికి వచ్చారు. బీరువా విరగ్గొట్టి ఉంది. అందులోని 17 తులాలు బంగారం, 30 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు.. చోరీ జరిగిన ఇంటితోపాటు పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా... ఒకరు ముఖానికి మాస్క్, టోపీ ధరించి ఉండడంతో గుర్తించలేకపోయారు. గ్లౌజ్‌లు ధరించడంతో ఘటనా స్థలంలో వేలిముద్రలు కూడా లభించలేదు. నిందితుడు చోరీకి పాల్పడిన తర్వాత ఒకచోట పార్కింగ్ చేసి ఉన్న స్కూటీని తీసుకుని వెళ్లిపోయాడు. సీసీ కెమెరా ఫుటేజీలో గుర్తించిన స్కూటీ కోసం గాలించారు. కొన్నాళ్లకు మాధవధారలో పార్కింగ్ చేసి ఉండగా మహ్ట?షరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

# ఐదేళ్లు నిద్రపోయి ఇప్పుడు వైసీపీ ఉద్యమాలు చేయడమేంటని షర్మిల ప్రశ్న

ఫిబ్రవరి 07 (క్రైమ్ కౌంటర్ న్యూస్): చంద్రబాబు జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. స్వప్రయోజనాల కోసం సీమ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇద్దరూ నాటకాలు ఆడారని ఆమె ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ఇరువురు నేతల వైఖరిని ఆమె తప్పుబట్టారు.వైసీపీ ప్రభుత్వంపై షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.గత ఐదేళ్ల పాలనలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అంశంలో నిద్రపోయిన వైసీపీ, ఇప్పుడు ఓటమి తర్వాత ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్జీటీ వద్ద బలమైన వాదనలు వినిపించకుండా, కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాకుండా ఇప్పుడు ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు.ఐదేళ్లు ప్రధాని మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్‌కు అప్పుడు సీమకు నీళ్లివ్వాలని గుర్తుకురాలేదా అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, సీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆమె విమర్శించారు.మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు సంగమేశ్వరం వద్ద కాకుండా ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పడాన్ని కూడా షర్మిల తప్పుబట్టారు.ఎవరిని మోసం చేయడానికి ఇద్దరూ కలిసి ఈ నాటకాలు ఆడుతున్నారు మోదీ దగ్గర సాగిలపడి సీమకు అన్యాయం చేస్తారా అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. ఇద్దరు నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని, సీమ ప్రయోజనాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

# పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం

**ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం**
**ఈసీ ఆదేశాలతో ఓటర్ల జాబితాల రూపకల్పనపై అధికారుల కసరత్తు**
**- ఓటర్ల జాబితాల ప్రకటన తరువాత ఎన్నికల తేదీల వెల్లడి**
**- గ్రామాల్లో మొదలైన రాజకీయ వేడి**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 07 : అనకాపల్లిగ్రామ పంచాయతీల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుత సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి ముగియనుంది. గడువులోగా ఎన్నికల నిర్వహణకు కీలకమైన ఓటర్ల జాబితాల రూపకల్పన పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) జిల్లా పంచాయతీ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అయితే ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

జిల్లా పంచాయతీ అధికారులు ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల తయారీపై కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 24 మండలాల్లో 646 గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల జాబితాల రూపకల్పనపై సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల పంచాయతీల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా 31 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. అయితే ప్రభుత్వానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపినా ఆమోదం తెలుపుతూ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 646 గ్రామ పంచాయతీల పరిధిలోని వార్డుల వారీగా ఫొటోలతో ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో 14,94,947 మంది జనాభా ఉండగా, 2026 జనవరి 1వ తేదీ నాటికి జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాలు రూపొందించనున్నారు. జిల్లాలో 2024లో సార్వత్రిక ఎన్నికల నాటికి ఎస్ఈసీ ప్రకటించిన జాబితా ప్రకారం జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,73,591 మంది ఓటర్లు ఉన్నారు. 2025 జనవరిలో ఎస్ఈసీ ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం 12,91,044 మంది ఉన్నారు. గత ఏడాది 17,453 మంది ఓటర్లు పెరిగారు. ఈ ఏడాది మరో 15 వేల పైచిలుకు ఓటర్లు పెరగనున్నారని అంచనా వేస్తున్నారు. ఇంకా 2026 ఓటర్ల జాబితా అధికారికంగా ప్రకటించాల్సి వుంది. ఈ నెల 9వ తేదీన ఓటర్ల జాబితా ప్రకటన అనంతరం పంచాయతీల పరిధిలో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాలు రూపొందించనున్నారు. ఎన్నికల సంకేతాలు రావడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరోవైపు గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్‌ల ఖరారుపై కూడా కసరత్తు జరుగుతోంది. ఓటర్ల జాబితాల రూపకల్పనకు సంబంధించి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేస్తుందని, దాని ఆధారంగా గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు రూపొందించి ముసాయిదా జాబితాలను పంచాయతీ కేంద్రాల్లో ప్రకటిస్తామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తెలిపారు. 2026 జనవరి 1 నాటికి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీల్లో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తామన్నారు. అయితే ఈ ప్రక్రియ జరిపేందుకు ఎస్ఈసీ నుంచి ఇంకా షెడ్యూల్ విడుదల కావాల్సి ఉందని తెలిపారు.

# పనుల నాణ్యతపై విజిలెన్స్ విచారణ జరిపిస్తాం..



క్రైం కౌంటర్ న్యూస్, ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 :ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో జరు గుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ పడబోమని, అవసరమైతే విజిలెన్స్ విచారణ జరిపిస్తామంటూ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను ఆయన శనివారం తనిఖీ చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.21.30 కోట్లతో పనులు చేపట్టారు. గతంలోను ఎంపీ ఈ పనులను తనిఖీ చేశారు. శనివారం మరోసారి పరిశీలించి పనుల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్లోరింగ్ పనులు, వెయిటింగ్ హాలు, టాయిలెట్స్ సహా జరుగుతున్న, పూర్తయిన పనుల్లో నాసిరకం సామగ్రి వాడారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టరు ఎంపీ తనిఖీ సమయంలో రాలేదు. అనంతరం విలేకరులతో ఎంపీ మాట్లాడుతూ పనుల తీరుపై ముఖ్యమంత్రి, కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. వచ్చే నెలలో మరోసారి తనిఖీ చేసి అప్పటికే మార్పు లేకుంటే విజిలెన్స్ విచారణ కోరి, కాంట్రాక్టరుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సినిమా



## ఈ అందాల నటి జీవితం కన్నీటి వ్యథ..


అభినయం, ఆకట్టుకునే అందంతో ప్రేక్షకులను అలరించిన నటి శ్రీ విద్య జీవితం తెరపై కనిపించినంత మురిపించేది కాదు. ఎన్నో కలలతో సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె వ్యక్తిగత జీవితంలో అడుగడుగునా కష్టాలను ఎదుర్కొన్నారు. ప్రేమించినవాడు దక్కలేదు, పెళ్లి చేసుకున్నవాడు మోసం చేశాడు. 1953 జులై 24న చెన్నైలో జన్మించిన శ్రీ విద్య తల్లి ఎం.ఎల్. వసంతకుమారి ప్రఖ్యాత కర్ణాటక విద్వాంసురాలు. తండ్రి వికటన్ ఆర్. కృష్ణమూర్తి తమిళ చిత్రాల్లో హాస్యనటుడు. శ్రీ విద్య పుట్టిన కొంతకాలానికి తండ్రికి పక్షవాతం రావడంతో కుటుంబం ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. దీంతో 14 ఏళ్ల వయసులోనే, 1967లో శివాజీ గణేశన్ నటించిన పౌరాణిక చిత్రం "తిరువరుట్చెల్వర్"తో బాలనటిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాల్సి వచ్చింది. ఈ చిత్రంలో మహానటి సావిత్రి, జెమిని గణేశన్, కేఆర్ విజయ లాంటి నటులతో కలిసి శివశక్తి నందనం పాత్ర పోషించారు. ఆ తర్వాత 1969లో "కుమార సంభవం" చిత్రంతో మలయాళ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేశారు.

తెలుగులో శ్రీ విద్య తొలి చిత్రం 1969లో వచ్చిన "పేదరాశి పెద్దమ్మ కథ". ఇందులో కాంతారావు సరసన రాజకుమారి పాత్రను పోషించారు. ఆ తర్వాత "తాత మనవడు" చిత్రంలో "రాయంటి నా మొగుడు రంగా మెళ్ళి తిరిగి రాలేదు" అనే ఐటెం సాంగ్‌లో కనిపించారు. హీరో కృష్ణ నటించిన "గాలిపటాలు" చిత్రంలో, అలాగే ఎన్టీఆర్ నటించిన "కథానాయకుని కథ"లో ఆయనకు చెల్లెలిగా, "రాముని మించిన రాముడు"లో ఆయన సరసన ఓ హీరోయిన్‌గా నటించారు. అయితే, 1975లో రజనీకాంత్, కమల్ హాసన్‌లతో కలిసి నటించిన తమిళ చిత్రం "అపూర్వ రాగంగళ్" తెలుగు రీమేక్ అయిన "తూర్పు పడమర"తోనే శ్రీ విద్యకు మంచి గుర్తింపు లభించింది. ఈ చిత్రంలోని "శివరంజని, నవరాగిణి" పాట ఎప్పటికీ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. ఈ చిత్రం తర్వాత ఆమె తెలుగు, తమిళ భాషల్లో బిజీ అయ్యారు.

తెలుగులో దర్శకరత్న దాసరి నారాయణరావు, తమిళంలో దర్శకుడు కే. బాలచందర్ శ్రీ విద్యకు మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు. "నూట్రిక్కు నూరు", "ఢిల్లీ టు మద్రాస్" చిత్రాలతో బాలచందర్ ఆమెను హీరోయిన్‌గా పరిచయం చేశారు. దాసరి తన తొలి చిత్రం "తాత మనవడు"లో సాంగ్ చేసే అవకాశం ఇచ్చి, ఆ తర్వాత "బంట్రోతు భార్య", "కన్యా-కుమారి" చిత్రాల్లో ముఖ్య పాత్రలు ఇచ్చారు. శ్రీ విద్య తర్వాత కాలంలో బాలకృష్ణ "ఇన్‌స్పెక్టర్ ప్రతాప్", "రాముడు భీముడు", "బంగారు బుల్లోడు", "గాండీవం" వంటి చిత్రాల్లో, చిరంజీవి "కొండవీటి దొంగ", "ముగ్గురు మొనగాళ్లు" చిత్రాల్లో, వెంకటేష్ "బ్రహ్మపుత్రుడు"(తల్లి పాత్ర), "చిన్నబ్బాయి", "ధర్మచక్రం" చిత్రాల్లో, నాగార్జున "విక్కీ దాదా" చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ఆమె గాయనిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు.

వ్యక్తిగత జీవితంలో శ్రీ విద్య ఎన్నో కష్టాలను అనుభవించారు. తమిళ చిత్రాల్లో నటిస్తున్నప్పుడే ఆమె కమల్ హాసన్‌ను గాఢంగా ప్రేమించారు. కమల్ కూడా ఆమెను ప్రేమించారు. వారి వివాహం గురించి కమల్, శ్రీ విద్య అన్నయ్య శంకర్‌కు చెప్పారు. అయితే, శ్రీ విద్య తల్లి వసంతకుమారి వారి వివాహానికి అంగీకరించలేదు. ఇద్దరూ ఒకే ఇండస్ట్రీలో ఉండటం, శ్రీ విద్య కెరీర్ ఇప్పుడిప్పుడే ఊపందుకోవడం, కమల్ ఆమె కంటే ఏడాది చిన్నవాడు కావడం వంటి కారణాలతో ఆమె పెళ్లిని నిరాకరించారు. తల్లి మాటకు ఎదురు చెప్పలేక, ప్రేమించిన కమల్‌కు దూరమయ్యారు శ్రీ విద్య. కొంతకాలానికి కమల్ వాణీ గణపతిని వివాహం చేసుకున్నారు. కమల్‌కు దూరమైన తర్వాత, 1976లో మలయాళ చిత్రం "శ్రీ కన్నల్" నిర్మాత జార్జ్ థామస్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. మానసికంగా దగ్గరైన శ్రీ విద్య, జార్జ్ మాటలు విని ఆయన వలలో పడిపోయారు. బ్రాహ్మణ యువతి అయిన శ్రీ విద్య, క్రైస్తవుడైన జార్జ్ వివాహానికి ఆమె తల్లి మళ్ళీ అంగీకరించలేదు. అయితే, ఈసారి తల్లి మాట వినకుండా, జార్జ్‌తో కలిసి ముంబై వెళ్లి క్రైస్తవ మతం స్వీకరించి 1978 జనవరి 8న వివాహం చేసుకున్నారు. దాదాపు మూడేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండి దాంపత్య జీవితం గడిపారు.





## చింతపండు తింటున్నారా..?

చింతపండు అనేది అందరికి తెలిసిన పుల్లని, ఆమ్లరుచి గల పండు. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందించే దీనిని మన పూర్వకాలం నుంచి దాదాపు అన్ని వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. వంటకాలకు రుచి అందించడంతోపాటు ఆరోగ్యానికి మంచిది. ఎన్నో అనారోగ్య సమస్యలకు కూడా చెక్ పెడుతుందీ పండు. ఆయుర్వేదంలో చింతపండును శక్తివంతమైన జీర్ణ సుముఖ పండు అని పరిగణిస్తారు. ఎందుకంటే.. చింతపండు ప్రధానంగా జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. దీనిలోని పుల్లని రుచి, టార్టారిక్, ఇతర సేంద్రీయ ఆమ్లాలు జీర్ణ రసాలను సక్రియం చేస్తాయి, ఫైబర్, పాలీశాకరైడ్లు (పెక్టిన్, మ్యూసిలేజ్) పేగు కదలికలను సులభతరం చేస్తాయి.

చింతపండు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం తగ్గుతాయి. మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. భారీ, కారమైన ఆహారం కూడా సులభంగా జీర్ణమవుతుంది. చింతపండు తినడం వల్ల లాలాజలం స్రవిస్తుంది. ఇది కాలేయం నుంచి పిత్తాన్ని విడుదల చేస్తుంది. దీంతో కొవ్వుల జీర్ణక్రియ సులభం అవుతుంది.

శరీరంలోని విషాలను తొలగిస్తుంది

చింతపండు విటమిన్ జ, యాంటీఆక్సిడెంట్లు, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్ లతో సమృద్ధి చెందింది. ఇవి.. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. శరీరంలో వాపును తగ్గిస్తాయి. శరీర వేడిని సమతుల్యంగా ఉంచుతాయి. అత్యధిక వేడిలో జ్వరం, వాంతులు, విరేచనాల సమయంలో చింతపండు నీరు సహజ నివారణిగా ఉపయోగపడుతుంది.

గుండె. రక్తపోటు కోసం

చింతపండులోని ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు.. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రక్తపోటును నియంత్రించడంలో ఉపయోగపడతాయి.

కీళ్ల నొప్పులు, మలబద్ధకం నివారణ

చింతపండును ఆయుర్వేదంలో బాహ్య, అంతర్గత ఔషధంగా ఉపయోగిస్తారు. కీళ్ల నొప్పులు, రుమాటిజం, వాపులను తగ్గించడంలో చింతపండు పేస్ట్ ఉపయోగపడుతుంది. మహిళలలో మెన్స్ట్రువల్ సమస్యలు, అలసట, బలహీనతలను తగ్గిస్తుంది.

మితమైన వాడకం ముఖ్యం

చింతపండు అధికంగా తినడం వల్ల.. అసిడిటీ, గ్యాస్, గుండెలో మంట, దంతసమస్యలు, గొంతు నొప్పి వంటి సమస్యలు రావచ్చు. అందువల్ల, ఆయుర్వేద ప్రకారం చింతపండును సరైన పరిమాణంలో మాత్రమే తీసుకోవడం ఉత్తమం. చిన్న మోతాదులో చింతపండు చట్నీ లేదా చింతపండు చారు/సాంబార్ తీసుకోవడం జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.

పేగులో వాయువును తగ్గించి, కడుపును శుభ్రంగా ఉంచుతుంది. చింతపండు కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు; ఇది జీర్ణక్రియ, హృద్రోగ, ఇమ్యూనిటీ, శరీర ఆరోగ్యంలో సహాయకంగా ఉంటుంది. సరైన పరిమాణంలో దీన్ని తీసుకోవడం వల్ల, శరీరం ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటుంది.

ఈ వార్తలోని సమాచారం అందుబాటులో ఉన్న వనరుల నుంచి సేకరించి పాఠకుల ఆసక్తి మేరకు అందించడం జరిగింది. దీనిని టీవీ9 తెలుగు ధృవీకరించదు.)



## పచ్చి గుడ్లు తాగితే ఎక్కువ బలం వస్తుందా..?

ప్రోటీన్ లెక్క ఇది : నోయిడాలోని నిదాన్ మదర్ అండ్ చైల్డ్ కేర్ శిశువైద్యుడు డాక్టర్ రాజీవ్ రంజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రోటీన్ శోషణ విషయంలో ఉడికించిన గుడ్లదే పైచేయి. వీటిని తిన్నప్పుడు మన శరీరం అందులోని ప్రోటీన్‌ను 90 శాతం వరకు గ్రహించగలదు. పచ్చిగా తీసుకున్నప్పుడు శరీరం కేవలం 50 శాతం ప్రోటీన్‌ను మాత్రమే గ్రహిస్తుంది. అంటే మీరు పచ్చి గుడ్లు తింటే సగం ప్రోటీన్ వృథా అవుతుందన్నమాట.సాల్మోనెల్లా బ్యాక్టీరియా: పచ్చి గుడ్లలో సాల్మోనెల్లా అనే ప్రమాదకర బ్యాక్టీరియా ఉంటుంది. ఇది తీవ్రమైన ఫుడ్ పాయిజనింగ్, విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పికి దారితీస్తుంది.బయోటిన్ లోపం: పచ్చి గుడ్లలో అవిడిన్ అనే ప్రోటీన్ ఉంటుంది. ఇది మన శరీరం విటమిన్ బి7ను గ్రహించకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల జుట్టు రాలడం, గోర్లు పెళుసుగా మారడం వంటి సమస్యలు వస్తాయి. గుడ్డును ఉడికించడం వల్ల ఈ అవిడిన్ నాశనం అవుతుంది.జీర్ణ సమస్యలు: పచ్చి గుడ్లు తింటే వికారం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు ఎదురవ్వడం చాలా సాధారణం. అంతేకాకుండా గుడ్లలో ప్రోటీన్‌తో పాటు విటమిన్ డి, బి12, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అయితే వ్యక్తి వయస్సు, బరువు, వాతావరణాన్ని బట్టి గుడ్ల సంఖ్యను నిర్ణయించుకోవాలి.గుడ్లు సహజంగా వేడిని కలిగిస్తాయి కాబట్టి వేసవిలో వీటి పరిమాణాన్ని పరిమితం చేయడం మంచిది. పూర్తి పోషకాలు అందాలంటే గుడ్లను ఎల్లప్పుడూ ఉడకబెట్టి లేదా వండి మాత్రమే తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.

## కష్టాల్లోనూ కసిగా పోరాడారు..

ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. టీ20 వరల్డ్ కప్ 2026 ఆరంభ మ్యాచ్‌లోనే అమెరికాను 29 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టింది. టాప్ ఆర్డర్ తడబడినా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వీరోచిత బ్యాటింగ్‌తో జట్టును గెలుపు తీరానికి చేర్చాడు. టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో భారత్ మొదట బ్యాటింగ్ చేస్తూ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. అమెరికా బౌలర్ షాడ్లీ వాన్ షాక్విక్ 4 వికెట్లతో భారత టాప్ ఆర్డర్‌ను వణికించాడు. పవర్‌ప్లేలోనే భారత్ 4 వికెట్లు కోల్పోయి 46 పరుగులకే పరిమితమైంది. అభిషేక్ శర్మ (0), ఇషాన్ కిషన్ (20), తిలక్ వర్మ (25), శివం దూబే (0) వెనువెంటనే అవుట్ కావడంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన అనుభవాన్నంతా ఉపయోగించి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 84 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరును అందించాడు.

162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా జట్టు భారత బౌలర్ల ధాటికి తలవంచింది. మహమ్మద్ సిరాజ్ రెండో ఓవర్లోనే గౌస్‌ను అవుట్ చేసి అమెరికాకు షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ సింగ్ అమెరికా కెప్టెన్ మోనాంక్ పటేల్‌ను డకౌట్ చేయడంతో ఆ జట్టు కోలుకోలేకపోయింది. అమెరికా బ్యాటర్లలో మిలింద్ (34), సంజయ్ (37) కాసేపు పోరాడినా, భారత స్పిన్నర్లు అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వికెట్లు పడగొట్టారు. చివరికి అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 132 పరుగులకే పరిమితమైంది. భారత్ తరపున సిరాజ్ 2, అర్ష్‌దీప్ 2, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

వైరల్ ఫీవర్ కారణంగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌కు దూరమవ్వడం భారత అభిమానులను ఆందోళనకు గురిచేసింది. అతని స్థానంలో వచ్చిన మహమ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించి రెండు వికెట్లు తీశాడు. ఇక అమెరికా జట్టులో అలీ ఖాన్, శుభమ్ రంజనే గాయపడటం ఆ జట్టుకు పెద్ద దెబ్బ తగిలింది. ఈ విజయంతో భారత్ గ్రూప్ టేబుల్‌లో టాప్ స్థానానికి చేరుకుని తన తదుపరి మ్యాచ్ కోసం సిద్ధమవుతోంది.




## ముంబైలో సూర్య ప్రతాపం..కష్టాల్లో ఉన్న భారత్‌ను ఆదుకున్న కెప్టెన్ ఇన్నింగ్స్.

ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, అమెరికా మధ్య జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 ఉత్కంఠభరిత పోరులో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. ఒకానొక దశలో పవర్‌ప్లేలోనే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ భారత్‌ను కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన వీరోచిత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. అమెరికా బౌలర్ల ధాటికి స్టార్ బ్యాటర్లు విఫలమైనా, సూర్య ఒంటరి పోరాటం చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు.

టాస్ గెలిచిన అమెరికా ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుని భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఊహించినట్టే అమెరికా బౌలర్లు భారత బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఓపెనర్ అభిషేక్ శర్మ గోల్డెన్ డకౌట్ కాగా, ఇషాన్ కిషన్ (20), తిలక్ వర్మ (25) కాసేపు పోరాడారు. అయితే అమెరికా బౌలర్ షాడ్లీ వాన్ షాక్విక్ వేసిన ఆరో ఓవర్లో మ్యాచ్ మలుపు తిరిగింది. ఒకే ఓవర్లో ఇషాన్, తిలక్, శివం దూబేలను అవుట్ చేసి భారత్ నడ్డి విరిచాడు. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 46 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ కూడా విఫలమవడంతో భారత్ వంద పరుగులు దాటడం కష్టమే అనిపించింది.

క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన అనుభవాన్ని అంతా రంగరించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం తొందరపడకుండా ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. మొదట నెమ్మదిగా ఆడినా, క్రీజులో కుదురుకున్నాక అమెరికా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్య, చివరికి 49 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 84 పరుగులు చేసి ఔటయ్యాడు. అక్షర్ పటేల్(14)తో కలిసి విలువైన భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ 161 పరుగుల గౌరవప్రదమైన స్కోరును సాధించగలిగింది.

అమెరికా బౌలర్లు అద్భుతంగా రాణించినప్పటికీ, మ్యాచ్ చివరలో ఇద్దరు కీలక ఆటగాళ్లు గాయపడటం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. మెయిన్ బౌలర్ అలీ ఖాన్ 18వ ఓవర్ వేస్తూ మధ్యలోనే మైదానాన్ని వీడగా, అతని ఓవర్‌ను పూర్తి చేసిన శుభమ్ రంజనే కూడా మోకాలి నొప్పితో ఇబ్బంది పడ్డాడు. ఇక 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగనున్న అమెరికాను భారత బౌలర్లు ఎలా అడ్డుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. బుమ్రా లేని లోటును మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ భర్తీ చేయాల్సి ఉంది. వాంఖడే పిచ్‌పై మంచు ప్రభావం ఉండే అవకాశం ఉండటంతో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయడం భారత్‌కు సవాలుతో కూడుకున్న పని.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com